ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 284 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

శుక్రవారం 16 మే 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

అంతర్జాతీయ సమాజం దృష్టికి పాక్

ఉగ్ర కుట్రలు తీసుకెళ్లే యోచనలో భారత్!

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదం పై భారత్ జరిపిన పోరాటాన్ని ప్రపంచ దేశాలకు వివరించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మే 16, (రిపబ్లిక్ న్యూస్): ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్ పై భారత్ ఇప్పటికే దౌత్య చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ తర్వాత దాయాది పై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే కేంద్రం పలు దేశాల రాయబారులు, విదేశాంగ మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదంపై పాకిస్థాన్ పోషిస్తున్న పాత్రపై న్యూదిల్లీ వైఖరిని అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేయడానికి విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

అందుకోసం వివిధ రాజకీయ పార్టీలతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతి ప్రతినిధి బృందంలో 5-6 మంది ఎంపీలు, ఒక విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి, ప్రభుత్వ ప్రతినిధి ఉంటారు. మొత్తం ఎనిమిది గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈ బృందాలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ నేతృత్వం వహించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. వీరు మే 22న భారతదేశం నుంచి వివిధ దేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వారు ముఖ్యంగా ఐదు అంశాలకు ప్రపంచ దేశాలకు వివరిస్తారు.

1. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు
2. పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్ను ఎలా చేపట్టిందో వివరణ
3. భవిష్యత్తులో భారత్పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత
4. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం
5. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నోఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం

ఈ విషయం గురించి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతోందని.. త్వరలో ఈ బృందాలను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దు ఉగ్రవాదం అంశంపై దేశ ఐక్యతను ప్రదర్శించడానికి చేసే ఒక సమష్టి ప్రయత్నంగా దీనిని అభివర్ణించాయి. ఈ బృందాలు విదేశీ ప్రభుత్వాలు, రక్షణ అధికారులు, మీడియా సంస్థలతో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. గతంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు.. అటల్ బిహారీ వాజ్పేయీని ఎన్నెన్ఆర్సీకి పంపడం వంటి విషయాలను ఆదర్శంగా తీసుకొని ఈ చర్యలకు సమాయత్తమవుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

నాడు వాజ్‌పేయిని ఐరాసకు పంపిన పీవీ..

1994లో భారత్- పాకిస్థాన్ తీవ్ర ఉద్రిక్తతలను ఎదుర్కొన్న సమయంలో జమ్మూకశ్మీర్లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ఇస్లామాబాద్.. యూఎన్ మానవ హక్కుల కమిషన్‌లో ఒక తీర్మానాన్ని సమర్పించడానికి సిద్ధమయ్యింది. దీంతో అప్పటి భారత ప్రధాని పీవీ నరసింహారావు పాక్పై దౌత్య వ్యూహాన్ని అమలుచేశారు. ఇరుదేశాల మధ్య పరిస్థితులను అక్కడి అధికారులకు వివరించడానికి ఐరాస వద్దకు భారత్ నుంచి బహుళ పార్టీల ప్రతినిధుల బృందాన్ని పంపారు. దీనికి దివంగత భాజపా నేత అటల్ బిహారీ వాజ్పేయీ నాయకత్వం వహించారు. అప్పటి విదేశాంగ సహాయ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఫరూక్ అబ్దుల్లా ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో యూఎన్ భారత రాయబారిగా ఉన్న హమీద్ అన్సారీ కూడా కీలక పాత్ర పోషించారు. వీరంతా కలిసి యూఎన్లో పాకిస్థాన్ ఆరోపణలను సమర్థవంతంగా ఎందుర్కొంటూ.. ఆ దేశం చేసిన తీర్మానాన్ని సమర్థవంతంగా పరిష్కరించారు. దీంతో ఇస్లామాబాద్ తన తీర్మానాన్ని ఉపసంహరించుకుంది.

ఆపరేషన్ సిందూర్.. పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి కేంద్రం నో..!

ఆపరేషన్ సిందూర్ పై చర్చ కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిరాసక్తత చూపిస్తున్నట్లు సమాచారం.

దిల్లీ, మే 16, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం దాడి అనంతరం నెలకొన్న భారత్-పాక్ ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ పై చర్చించేందుకు పార్లమెంట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఇందుకు కేంద్రం నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రం సముఖంగా లేదని సమాచారం.



ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాది జులైలో జరిగే వర్షాకాల సమావేశాల్లోనే ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పనుంది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలు, కలసికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు పార్లమెంట్లో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లోక్సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రధాని మోదీకి లేఖ రాశారు. "ఐక్యత, సంఘీభావం అవసరమైన ఈ తరుణంలో, వీలైనంత త్వరగా ఉభయ సభల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయడం ముఖ్యమని విపక్షం భావిస్తోంది" అని రాహుల్ పేర్కొన్నారు. వీరితో పాటు మరికొందరు విపక్ష ఎంపీలు సైతం ఇదే డిమాండ్ వినిపించారు. అయితే, విపక్షాల డిమాండ్ను భాజపా నేతలు తోసిపుచ్చారు. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ తాత్కాలికంగానే నిలిచిందని, ఈ సమయంలో అనవసర చర్చలకు తావివ్వొద్దని ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత ప్రత్యేక సమావేశం డిమాండ్ను లేవనెత్తాలని సూచించారు. ఈ క్రమంలోనే కేంద్రం కూడా దీనిపై సుముఖంగా లేనట్లు తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి. జులైలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి.

కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

ఏపీ మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరించింది.

దిల్లీ, మే 16, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సీఎంవో మాజీ కార్యదర్శి కె. ధనుంజయరెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్టీ కృష్ణమోహన్రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది.

దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని పేర్కొంది. వీరికి గతంలో ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ తీర్పును ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. ముందస్తు బెయిల్ ఇస్తే విచారణాధికారి చేతులు కట్టేసినట్లు అవుతుందని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. రెగ్యులర్ బెయిల్కు అప్లై చేస్తే నిబంధనలు, మెరిట్స్ ప్రకారం హైకోర్టు, ట్రయల్ కోర్టులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. మద్యం కుంభకోణంలో కె.ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ కీలక నిందితులుగా ఉన్నారు. వీరు ముగ్గురూ మాజీ సీఎం జగన్కు అత్యంత సన్నిహితులు. 'మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్రెడ్డి, గోవిందప్పలతో పాటు ధనుంజయరెడ్డి పాత్ర ఉంది. ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనేదానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారు' అని సిట్ ఇప్పటికే తేల్చింది.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు: మంత్రి కొండా సురేఖ

వరంగల్ లో ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి.

వరంగల్, మే 16, (రిపబ్లిక్ న్యూస్): ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్లో లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు.

"క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

ఫ్యూచర్ సిటీలో విద్యుత్ లైన్లు అన్నీ భూగర్భంలోనే:సీఎం రేవంత్

వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

హైదరాబాద్, మే 16, (రిపబ్లిక్ న్యూస్): వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, సబ్ స్టేషన్లు అప్గ్రేడ్ చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. విద్యుత్శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. "భవిష్యత్లో డేటా సెంటర్ల హబ్ హైదరాబాద్ మారబోతోంది.



విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. ఫ్యూచర్సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. అక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్పోల్స్ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. ఓఆర్ఆర్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలి"అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు.

చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీలో పెట్టుబడులు:మంత్రి నారా లోకేశ్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

గుత్తి, మే 16, (రిపబ్లిక్ న్యూస్): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వివిధ సంస్థలు పెట్టుబడి పెట్టేందుకు సీఎం చంద్రబాబు బ్రాండే కారణమని చెప్పారు. అనంతపురం జిల్లా గుత్తి మండల బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్కు మంత్రి లోకేశ్ భూమిపూజ చేశారు. 2,300 ఎకరాల్లో రూ.22వేల కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు.

భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో 10వేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మన నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా.. దేశ అవసరాలకు కూడా ఉపయోగపడనుందని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని ఈ సందర్భంగా లోకేశ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం రోడ్లపై గుంతలనూ పూడ్చలేకపోయిందని విమర్శించారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేకపోయారన్నారు. ప్రస్తుతం టాటా ఎనర్జీ, టీసీఎస్ సహా అనేక సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని లోకేశ్ వివరించారు. డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను వచ్చే నెలలో భర్తీ చేస్తామన్నారు.

తిరుమల శ్రీవారికి రూ.3.63 కోట్ల విలువైన ఆభరణాలు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భారీ బంగారు కానుక అందజేశారు.

తిరుమల, మే 16, (రిపబ్లిక్ న్యూస్): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భారీ బంగారు కానుక అందజేశారు. కోల్కతాకు చెందిన సంజీవ్ గోయెంకా రూ.3.63 కోట్ల విలువైన 5.267 కేజీల బంగారం, వజ్రాలు, విలువైన రత్నాలతో పొదిగిన కఠి, వరద హస్తాలను చేయించి స్వామివారికి సమర్పించారు. ఈ మేరకు తిరుమలలోని రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ఆభరణాలను అందించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1830 :** ఫ్రాన్సు కు చెందిన గణిత, భౌతిక శాస్త్రవేత్త జోసెఫ్ ఫోరియర్ మరణం (జ. 1768).
- **1831 :** మైక్రోఫోను సృష్టికర్త డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్ జననం (మ.1900). (చిత్రంలో)
- **1881 :** మొట్టమొదటి ఎలక్ట్రిక్ ట్రాము, బెర్లిన్ (జర్మనీ) సమీపంలో, ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.
- **1929 :** హాలీవుడ్‌లో మొదటిసారిగా అకాడమీ పురస్కారాలు ప్రధానం చేయబడ్డాయి.
- **1960 :** భారతదేశంలో మొట్టమొదటి సారిగా భారత-బ్రిటన్ల మధ్య టెలెక్స్ సర్వీసు ప్రారంభమైంది.
- **1975 :** భారత 22వ రాష్ట్రం గా సిక్కిం విలీనమైంది.
- **1996 :** భారత 11వ ప్రధానమంత్రిగా అటల్ బిహారీ వాజపేయి నియమితుడైనాడు.

జోసెఫ్ ఫోరియర్


డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్

బెర్లిన్

అకాడమీ పురస్కారాలు

టెలెక్స్


సిక్కిం

అటల్ బిహారీ వాజపేయి

'రామాయణ'లో కాజల్..

ఆ పాత్ర చేయనున్నారా...?

బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తోన్న చిత్రం 'రామాయణ'. ఇందులో నటి కాజల్ నటించనున్నట్లు తెలుస్తోంది..

బాలీవుడ్ నటుడు రణ్ బీర్ కపూర్, నటి సాయిపల్లవి జంటగా నటిస్తోన్న చిత్రం 'రామాయణ'. బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికర అప్డేట్ నెట్టింట వైరల్గా మారింది. నటి కాజల్ అగర్వాల్ ఈ ప్రాజెక్ట్ భాగమైనట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె రావణాసురుడి సతీమణి మండోదరి పాత్రలో కనిపించనున్నారని టాక్. ఈ విషయంపై ఇప్పటికే టీమ్ సంప్రదించిందని.. ఆమె సుముఖత వ్యక్తం చేశారని తెలుస్తోంది. అంతేకాకుండా గత వారం లుక్ టెస్ట్ కూడా జరిగిందని ఆంగ్ల వెబ్సైట్స్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఒకవేళ అదే కనుక నిజమైతే కన్నడ నటుడు యశ్కు జంటగా కాజలు ఈ సినిమాలో చూడొచ్చు. యశ్ ఇందులో రావణాసురుడిగా నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల ఆయన షూట్లో భాగమైనట్లు వార్తలు వచ్చాయి. దర్శకుడిగా నితేశ్ తివారీకి బాలీవుడ్లో మంచి పేరు ఉంది. 'దంగల్', 'ఛిఛోరే', 'బవాల్' వంటి చిత్రాలను ఆయన తెరకెక్కించారు. ఆయన నుంచి వస్తోన్న చిత్రం కావడంతో 'రామాయణ'పై సినీప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా నుంచి అప్డేట్లను తెలుసుకోవాలని వారు ఎదురుచూస్తున్నారు. అయితే టీమ్ మాత్రం సినిమాకు సంబంధించిన విషయాలను ఎక్కడా రివీల్ చేయడం లేదు. యశ్ ఈ చిత్రానికి నిర్మాతగానూ వర్క్ చేస్తున్నారు. దీనిని రెండు భాగాలుగా ప్రేక్షకులకు అందించనున్నారు. ఇదే విషయాన్ని ఈ సినిమా నిర్మాతల్లో ఒకరైన నమిత్ మల్హోత్రా చెప్పారు. "5000 సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నామ"ని గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

అర్థం లేని వాటిపై చర్చలు అనవసరం.. దేశం గురించి మాట్లాడండి: రేణూ దేశాయ్



సామాజిక అంశాల గురించి మాట్లాడటంలో ఎప్పుడూ ముందుంటారు నటి రేణూ దేశాయ్. దేశం కోసం ఆలోచించండి అంటూ తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్ గా మారింది. చైనా ఉత్పత్తులను ఉపయోగించడం మానేయాలని సూచించారు. 66 మన దేశం, మన కుటుంబ భద్రత గురించి మీరు నిజంగా శ్రద్ధ వహిస్తే.. చైనాలో తయారైన చిన్న వస్తువును కూడా కొనడం మానేయండి. ఏదైనా కొనే ముందు లేబుల్ చదవడం ఇప్పటినుంచైనా ప్రారంభించండి. చైనా ఉత్పత్తులను కొనడం మానేశామని అందరికీ తెలిసేలా చేయండి. నేను ఇప్పటివరకూ ఆ దేశంలో తయారైన వాటిని కొన్నాను. కానీ, ఈ మధ్య ప్రతి వస్తువుపై ఉండే లేబుల్ను చదువుతున్నాను. అది చైనాలో తయారైంది అయితే కొనడం మానేయడానికి ప్రయత్నిస్తున్నా. ఇది సుదీర్ఘమైన ప్రక్రియ. కనీసం ఇప్పటినుంచైనా ప్రారంభిద్దాం. మీరు కొనాలనుకునే వస్తువు ఎక్కడ తయారైందో తెలుసుకోండి. మన దేశాన్ని ఆదరిద్దాం" అని పోస్టో రాసుకొచ్చారు. ఈ పోస్టు అందరూ షేర్ చేయాలని కోరారు. 'మనమందరం ఎక్కడో ఒకచోట దీన్ని ప్రారంభించాలి. మన దేశానికి, మన మాతృభూమికి మనం మద్దతు ఇవ్వకపోతే ఎవరు ఇస్తారు?. ఈ విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు షేర్ చేయండి. అర్థం లేని టీవీ రియాలిటీ షోల గురించి రూమర్స్ మాట్లాడుకోవడం కంటే, మన దేశ పరిస్థితి గురించి చర్చించుకోవడం మొదలు పెడదాం' అని తెలిపారు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

ముంబయి ఇండియన్స్ జట్టులోకి జానీ బెయిర్స్టో, రిచర్డ్ గ్లీసన్

రాన్ రికెల్టన్, విల్ జాక్స్ స్థానాల్లో ముంబయి ఇండియన్స్ జట్టులోకి జానీ బెయిర్ స్టో, రిచర్డ్ గ్లీసన్ రానున్నారు.

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా వారం రోజుల పాటు వాయిదా పడిన ఐపీఎల్, ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో పునఃప్రారంభం కానుంది. కానీ కొన్ని కారణాల వల్ల పలువురు విదేశీ ఆటగాళ్లు తిరిగి ఐపీఎల్లో పాల్గొనేందుకు రాలేకపోతున్నారు. మరికొందరేమో మొదట చేసుకున్న ఒప్పందం ప్రకారం మే 27 వరకు మాత్రమే ఆయా ఐపీఎల్ జట్లకు అందుబాటులో ఉండనున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల.. వేలంలో అమ్ముడుపోని ఇతర ఆటగాళ్లతో స్వల్పకాలిక ఒప్పందాలు చేసుకునేందుకు ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ అనుమతి మంజూరుచేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ముంబయి ఇండియన్స్ జట్టు ఇప్పటికే ఇద్దరు ఆటగాళ్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్లో ర్యాన్ రికెల్టన్ ఆడనున్న కారణంగా, విల్ జాక్స్ ఇంగ్లండ్ తరపున వెస్టిండీస్తో జరగనున్న ఆటలో పాల్గొనాల్సి ఉన్నందున ఐపీఎల్ ప్లేఆఫ్కు అందుబాటులో ఉండడం లేదు. దీంతో వీరి స్థానాల్లో జానీ బెయిర్స్టో, రిచర్డ్ గ్లీసన్ ముంబయి ఇండియన్స్ జట్టులోకి రానున్నారు. జానీ బెయిర్ ఐపీఎల్లో గత సీజన్లలో సన్రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తరపున ఆడాడు. కానీ 2025 వేలంలో ఏ ఒక్క జట్టూ తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం ఇతని రాకతో ఆరోసారి ఐపీఎల్ నెగ్గాలన్న ముంబయి జట్టు ఆశలకు ఊతం లభించినట్టైంది. రిచర్డ్ గ్లీసన్ ఐపీఎల్ 2024 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున కేవలం రెండు మ్యాచ్లు మాత్రమే ఆడాడు. ఏది ఏమైనా రికెల్టన్, విల్ జాక్స్ ముంబయికి దూరం కావడం ఆ జట్టు పెద్ద లోటే రికెల్టన్ ఆడిన పలు అద్భుత ఇన్నింగ్స్, విల్ జాక్స్ ఆల్ రౌండర్ ప్రదర్శన ముంబయి ఇండియన్స్ జట్టుకు ఈ ఐపీఎల్ సీజన్లో ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం వీరి స్థానాల్లో వచ్చిన జానీ బెయిర్, రిచర్డ్ గ్లీసన్ ఏమేరకు రాణిస్తారో వేచిచూడాల్సిందే.

అందం

ఎండలో తిరగడం వల్ల స్కిన్ నల్లగా మారిందా, కాస్ట్లీ క్రీమ్స్ బదులు

కొన్ని పదార్థాలు రాస్తే నలుపు తగ్గి తెల్లగా మారతారు

ఎండలు పెరిగాయి. ఈ టైమ్లో స్కిన్ ట్యాన్ పెరుగుతుంది. ఈ సమస్యని దూరం చేసుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.

ట్యాన్ అనేది పెద్ద సమస్యే. దీని వల్ల స్కిన్ పాడవుతుంది. స్కిన్పై నల్లని మచ్చలు వస్తాయి. యూవి కిరణాల వల్ల సన్ బర్న్ ఇతర సమస్యలతో పాటు కొన్ని సార్లు స్కిన్ క్యాన్సర్ కూడా వస్తుంది. ఎండలో ఎక్కువగా ఉండడం వల్ల సూర్యుడి నుంచి వచ్చే కిరణాలు స్కిన్ని డ్యామేజ్ చేస్తాయి. దీంతో స్కిన్ బ్రౌన్, రెడ్ కలర్లోకి మారుతుంది. అయితే, సమస్యని తగ్గించేందుకు చాలా మంది ఎక్స్పెన్సివ్ ప్రోడక్ట్స్ వాడుతుంటారు. అలా కాకుండా ఇంట్లోనే కొన్ని చిట్కాలు సమస్యని తగ్గించి చర్మం మెరిసేలా చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.

టమాట రసం

టమాటల్లో లైకోపీన్ ఉంటుంది. ఇది స్కిన్ పిగ్మంటేషన్ని దూరం చేస్తుంది. ఎరుపు, నలుపు మచ్చల్ని తగ్గిస్తుంది. దీనికోసం ఓ టమాట తీసుకుని దానిని మెత్తగా ప్యూరీలా చేయాలి. 20 నిమిషాల పాటు ఉంచి ఆ తర్వాత చల్లని నీటితో క్లీన్ చేయాలి. రెగ్యులర్గా చేస్తే ట్యాన్ తగ్గుతుంది.

బంగాళాదుంప రసం

బంగాళాదుంపల్లోని గుణాలు చర్మంపై ఉన్న నలుపుని బ్రైట్గా కనిపించేలా చేస్తాయి. దీనికోసం పచ్చి బంగాళాదుంపని జ్యూస్లా చేసి అందులో నుంచి జ్యూస్ తీయాలి. దీనిని సన్ ట్యాన్ ప్రదేశంలో రాసి అరగంట పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత చల్లని నీటితో క్లీన్ చేయాలి. వారానికి 2 సార్లు ఇలా చేస్తుంటే త్వరలోనే సమస్య తగ్గుతుంది.

పసుపు, పెరుగు

పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది స్కిన్ని ఎక్స్ఫోలియేట్ చేసి బ్రైట్గా కనిపించేలా చేస్తుంది. అదే విధంగా, పసుపు ఇరిటేషన్ని తగ్గించి స్కిన్ని సాఫ్ట్గా చేస్తుంది. దీనికోసం అర టీస్పూన్ పసుపులో రెండు టేబుల్ స్పూన్ల పసుపు వేసి బాగా కలపండి. దీనిని ట్యాన్ ఉన్న చోట రాయండి. 20 నిమిషాల పాటు ఉంచి తర్వాత చల్లని నీటితో కడగండి. దీనిని వారంలో 3 సార్లు ఫాలో అవ్వండి. రెగ్యులర్గా చేస్తే రిజల్ట్ ఉంటుంది.

దోస

దోసకాయలో కూలింగ్ ప్రాపర్టీస్ ఉన్నాయి. దీనిని వాడడం వల్ల స్కిన్ చల్లగా ఉంటుంది. దీంతో ఎండ వల్ల కమిలిన చర్మం మెరుగ్గా మారుతుంది. దీనికోసం దోసరసం తీసుకుని దానిని కాటన్తో కమిలిన చర్మంపై రాయండి. అదే విధంగా గుండ్రంగా కట్ చేసి స్కిన్కి రాయండి. అలానే 20 నిమిషాల పాటు ఉంచండి. తర్వాత క్లీన్ చేసుకోండి. ఇలా చేయడం వల్ల ట్యాన్ తగ్గుతుంది. ముడతలు కూడా తగ్గుతాయి.

తేనె, నిమ్మరసం



తేనెలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉన్నాయి. దీనిని వాడడం వల్ల స్కిన్ డ్రైగా మారకుండా మాయిశ్చర్గా ఉంటుంది. అదే విధంగా నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ స్కిన్ని నేచురల్గానే బ్లైటెన్ చేస్తుంది. దీనికోసం కొద్దిగా నిమ్మరసంలో తేనె కలిపాలి. బాగా కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని ఎండ తగిలే ప్రాంతంలో రాయండి. 20 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోండి. గోరువెచ్చని నీటితో క్లీన్ చేస్తే మంచిది. నాలుగు వారాల పాటు రెగ్యులర్గా రాస్తే రిజల్ట్ మీకే తెలుస్తుంది.

అలోవెరా

అలోవెరాలో ట్యాన్ని తగ్గించే గుణాలు ఉన్నాయి. అందుకోసమే చాలా మంది స్కిన్ ప్రాబ్లమ్స్ని దూరం చేసేందుకు అలోవెరా జెల్ని వాడతారు. దీనికోసం అలోవెరా జెల్ని ముఖానికి రాయాలి. అదే విధంగా, ఎక్కడైతే స్కిన్ ఎక్స్పోజ్ అవుతుందో, ట్యాన్ పేరుకుపోయిందో అక్కడ మొత్తం రాయాలి. నైట్ మొత్తం అలానే ఉంచి తర్వాత ఉదయాన్నే క్లీన్ చేయాలి. వారం రెగ్యులర్గా చేస్తే రిజల్ట్ మీకే కనిపిస్తుంది.

గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.